సాక్షి అనకాపల్లి

ఆదివారం । 12 । నవంబర్ । 2023



న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు


డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: చెడుపై మంచి, దుష్టశక్తిపై దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. వెలుగుల పండగ దీపావళి వేళ తెలుగు ప్రజల ఇంట ఆనందాల సిరులు, సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ కాంతులు నింపిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు దీపావళిని సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

రేపు 'స్పందన'కు సెలవు

తుమ్మపాల: ఈనెల 13వ తేదీ సోమవారం దీపావళి పండుగ సందర్భంగా సెలవు దినం కనుక ఆరోజు కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఉండదని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు దీనిని గమనించి అర్జీలు తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి


అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల (కలెక్టరేట్): విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, లౌకికవాది అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్ఫూర్తితో దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రత్న కలాం మనదేశ తొలి విద్యామంత్రిగా పని చేశారని, ఆయన రూపొందించిన విద్యావిధానం దేశ అభివృద్ధికి ఎంతో తోడ్పడిందని చెప్పారు. సమైక్యతా వాదైన ఆజాద్ దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. మత సామరస్యాన్ని అందరూ పాటించాలని ఆయన ఆచరించి చూపించారని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ కలాం గొప్ప రచయిత, పాత్రికేయుడు, కవి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎ. శ్రీనివాసరావు, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా విస్తరణ అధికారి ఎ.ఎస్. ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా శోభారాణి



సాక్షి, అనకాపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విశాఖ జిల్లా డీఆర్‌డీఏ పీడీ శోభారాణి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతిని అమరావతి హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. కొత్తవారిని నియమించే వరకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా శోభారాణి వ్యవహరిస్తారు.

శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లడ్డూలను విక్రయించారు. ఆలయంలో కౌంటర్ల వద్ద 750 గ్రాముల కల్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాములు బరువు ఉన్న సాధారణ లడ్డూ రూ.50కు విక్రయించినట్లు ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.

దివ్యకాంతుల దీపావళి



చీకట్లను పారదోలి.. అందరి జీవితాల్లో వెలుగులు నింపుతూ.. పేద, ధనిక, చిన్న, పెద్ద తేడా లేకుండా.. కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకునే వెలుగుల వేడుక దీపావళి. ఈ పండగను పర్యావరణహితంగా జరుపుకోవాలని పెద్దలు హితవు చెబుతున్నారు. జిల్లాలో రెండు రోజుల ముందే పండగ సందడి నెలకొంది.

- అప్రమత్తతతోనే ఆనందాల వెలుగులు
- హరిత టపాసులతో పర్యావరణానికి మేలు
- సెల్లార్లు, టెర్రస్, డాబాలపై క్రాకర్స్ కాల్చొద్దంటున్న ఫైర్ అధికారులు

సాక్షి, అనకాపల్లి: ఆనంద కాంతులు విరజిమ్మే దీపావళి పండగంటే అందరికీ ఇష్టమే. టపాసులు కాలుస్తూ పిల్లల ముఖాల్లో విరబూసే వెలుగులు.. వారిని చూస్తూ మురిసిపోయే పెద్దలు.. అదో మధురానుభూతి. ఈ పర్వదినం వస్తోందంటేనే ఒక రకమయిన ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంటుంది. పర్యావరణానికి హాని కలగకుండా హరిత టపాసులతో (గ్రీన్ కాకర్స్) ఆనందంగా దీపావళి జరుపుకోవాలని పర్యావరణ శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) అధికారులు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటా ఆర్థిక పరిపుష్టి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఏడాది ప్రజలంతా వైభవంగా పండగ జరుపుకోవడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో 222 స్టాళ్లకు అనుమతి

జిల్లాలో మొత్తం 222 స్టాళ్లకు అధికారులు అనుమతి ఇచ్చారు. అందులో అనకాపల్లిలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో 42 స్టాళ్లు, రింగ్‌రోడ్డు బెల్లం మార్కెట్‌లో 6 స్టాళ్లు ఉన్నాయి. రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాల అధికారులు ముందస్తు జాగ్రత్తలతో స్టాల్స్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ప్రతి దుకాణానికి 3 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే అడ్డుకునేందుకు ఇసుక, నీళ్లు వంటి వాటిని ఏర్పాట్లు చేసుకోవాలని స్టాల్స్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇవీ జాగ్రత్తలు

- పటాసులు చేతిలో ఉంచుకొని కాల్చకూడదు. దీపం దగ్గర వెలిగించకూడదు. దూరంగా పెట్టి పొడవాటి అగరుపుల్లతో వెలిగించుకోవడం ఉత్తమం.
- వెలగని బాణసంచాను చేతితో తాకరాదు. అది పేలి ముఖానికి, చేతికి గాయాలయ్యే అవకాశాలు ఉన్నాయి.
- పిల్లలను పేలుడు పదార్థాలకు దూరంగా ఉంచాలి.
- బాణసంచా కాల్చే సమయంలో విధిగా పాదరక్షలు ధరించాలి.
- టపాకాయలను మైదాన ప్రాంతంలో మాత్రమే వెలిగించాలి. జనసందోహం మధ్యలో కాల్చకూడదు. టపాసులు వెలిగించేటప్పుడు ముఖం, చేతులు దూరంగా ఉంచాలి.

అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాల్సిన ఫైర్‌స్టేషన్ల నంబర్లు

అనకాపల్లి	9963728723
యలమంచిలి	9963728947
నర్సీపట్నం	9963728766
మాడుగుల	9963729442
చోడవరం	9963729097
సబ్బవరం	9963729473

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



ప్రజలందరిలో ఈ ఏడాది దీపావళి పండగ కొత్త వెలుగులను నింపాలి. క్రాకర్స్ వెలిగించేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్లల్లో పటాసులను చిన్న పిల్లలకు అందనంత ఎత్తులో దాచి పెట్టడం మంచిది. ఎత్తయిన భవనాల నుంచి క్రాకర్స్ కాల్చొద్దు. విద్యుత్ వైర్లు ఉండే చోట క్రాకర్స్, టపాసులు వేయరాదు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.

– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా కలెక్టర్

అనుమతి లేని స్టాల్స్‌పై చర్యలు



అనుమతి లేకుండా క్రాకర్స్‌ని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. బాల్కనీ, టెర్రస్‌లపై బాణసంచా కాల్చొద్దు. అత్యవసరమైతే 101 టోల్‌ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి అక్కడ అడ్రస్, లాండ్‌మార్క్ త్వరగా చెబితే కాల్‌సెంటర్ నుంచి మాకు త్వరగా సమాచారం అందుతుంది. బాణసంచా దుకాణదారులు విధిగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

– ఆర్.వి.రమణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

కాలిన గాయాలపై పేస్ట్‌లు పూయవద్దు..



క్రాకర్స్ ద్వారా కాలిన గాయాలపై ఐస్ నీరు, పెన్ సిరాయి, ఐస్ ముక్కలతో రుద్దవద్దు. ఆయింట్‌మెంట్, టూత్ పేస్ట్, ఇంక్, వ్యాజలీన్, పసర్లు, పసుపు వంటివి పూయకూడదు. దుస్తులు అంటుకున్నప్పుడు కంగారుపడి పరిగెత్తకూడదు. పడుకుని దొర్లటం వలన మంటలు ఆరిపోతాయి. గాయాలపై వెంటనే నీళ్లు పోయాలి. శరీరానికి అంటుకుపోయిన దుస్తుల్ని తొలగించటానికి ప్రయత్నం చేయకూడదు. నీటితో చల్లార్చి.. బాధితుడి నోరు తెరిచి గాలి పీల్చేలా చూడాలి. గాయాన్ని శుభ్రమైన వస్త్రంతో కప్పి వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. అందుబాటులో ఉన్న ప్లాస్టిక్ సర్జరీ నిపుణుని వద్దకు లేకపోతే జనరల్ సర్జరీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లాలి. వెంటనే స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్తే కొలాజన్ పొర వేసి అత్యాధునిక వైద్యం చేస్తారు. వీలైనంత మేరకు కాటన్ డ్రెస్ వేసుకోవడం మంచిది.

– డాక్టర్ సుధాకర్, ఎన్ఆర్ఐ డీన్, విశ్రాంత ఏఎంసీ ప్రిన్సిపాల్

● వెలుగు దివ్వెలు


చిటపటలాడే సీమ టపాకాయలు.. వెలుగులు చిమ్మే విష్ణుచక్రాలు.. ముఖంలోకి వెలుగులు తెచ్చే మతాబు లు.. కాళ్ల కిందికొచ్చి కితకితలు పెట్టే భూచక్రాలు.. కొత్త దుస్తుల మెరుపులు.. మిఠాయిల రుచులు.. పిల్లలు పెద్దలుగా... పెద్దలు పిల్లలుగా మారి చేసుకునే వేయి దీపాల వెలుగుల పండగ.. దీపావళి వేడుక!

తరతరాలకు తరగని వెలుగు సీతారామయ్య


మందుగుండు సీతారామయ్య గొడౌన్‌లో తారాజువ్వలు తయారు చేస్తున్న కార్మికురాలు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది తీపిని పంచే బెల్లం మార్కెట్, ఆ తర్వాత వెలుగులు పంచే సీతారామయ్య మందుగుండు. ఒక వ్యక్తి సంకల్పంతో మొదలైన కృషి పరిశ్రమగా రూపుదిద్దుకుంది. అనకాపల్లికి చెందిన బుద్ద సీతారామయ్య కుటుంబానికి బాణసంచా తయారీలో శతాబ్దానికి పైగా చరిత్ర ఉంది. అనకాపల్లికి చెందిన ఉప్పల వంశస్థులు కటక్ నుంచి బాణసంచా తీసుకొచ్చి వెలిగించారు. ఆ వెలుగుల్ని చూసిన సీతారామయ్య బాణసంచా మనమెందుకు తయారు చేయకూడదని భావించారు. అప్పటి నుంచి తయారు చేయడం ప్రారంభించారు. 1920లోనే తయారీకి నాంది పలికారు. 1942లో వీరికి అధికారికంగా అనుమతి లభించింది.

ఏడాది పొడవునా బాణసంచా తయారీలోనే నిమగ్నం

చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, మతాబులు, మిన్నాలు, టపాసులు తయారు చేయడంలో మందుగుండు సీతారామయ్య కుటుంబీకులకు ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. వీరు ఏడాది పొడవునా బాణసంచా తయారీలోనే నిమగ్నమై ఉంటారు. దీపావళితోపాటు, అన్ని వేడుకలకు, శుభ, అశుభ కార్యక్రమాలకు వీరు మందుగుండు సరఫరా చేస్తారు. మరి

- 1942లో బ్రిటిష్ పాలకులు నిర్వహించిన క్రీడోత్సవాల్లో మందుగుండు వెలిగించి అప్పటి పాలకుల నుంచి అవార్డులు అందుకున్నారు.
- 1977లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానం మేరకు పులివెందుల వెళ్లి బాణసంచా కాల్చడం ద్వారా తన పేరు ప్రఖ్యాతలను ఇనుమడింప చేసుకున్నారు.
- ముంబై, బెంగుళూరు, కోల్‌కత్తా, ఖర్గపూర్ తదితర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాలకు సీతారామయ్యను ఆహ్వానించారంటే ఆయన కీర్తి ఎంతవరకు విస్తరించిందో తెలుసుకోవచ్చు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: జిల్లాలో అనుమతులు, నిబంధనలను అతిక్రమించి బాణసంచా నిల్వలు, అమ్మకాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటువంటివారిపై ఐపీసీ, పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాలకు తావివ్వకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాణసంచా సామగ్రి విక్రయించాలని విక్రయదారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఆసియా పారా క్రీడల్లో విజేతకు ఘన స్వాగతం

షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన రవికి స్వగ్రామంలో అపూర్వ గౌరవం 2లో



వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉపేక్షించను

- డీఎంహెచ్‌వో హేమంత్ హెచ్చరిక


అదనపు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

దేవరాపల్లి: ప్రజలకు వైద్య సేవలందించడంతో అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్ హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమన్వయ లోపంతో పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది ఒకరిపై మరొకరు ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎస్.లలిత, ఈ.పూజ్య మేఘన, సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడి పీహెచ్‌సీలో పరిస్థితిపై ఆరా తీశారు. వారం రోజుల్లోగా మనస్పర్థలను వీడి అందరూ సమిష్టిగా విధులు నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది హెడ్ క్వార్టర్‌లోనే నివాసం ఉండాలని, లేకుంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీలో ఇప్పటికే నాడు–నేడు పథకంలో అభివృద్ధిపనులు చేపట్టగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో అదనపు భవనం నిర్మాణానికి రూ.1.8కోట్లు మంజూరయ్యాయని, పనులు సైతం జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అదనపు భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

జిల్లాలో ఏడు కొత్త పీహెచ్‌సీ భవనాలు మంజూరు కాగా, ఆరు ఇప్పటికే పూర్తయి,ప్రారంభించామన్నారు. కె.కోటపాడు మండలం లంకవానిపాలెంలో పూర్తయిన పీహెచ్‌సీ భవనాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు.

ఉపమాకలో నరకాసుర వధ


నరకాసుర వధ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి నరకాసుర వధ కార్యక్రమం జరిగింది. నరక చతుర్దశిని పురస్కరించుకుని వేకువజామునే కొండపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన మూలవిరాట్‌కు అర్చకస్వామి సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి నరకాసురుడి గడ్డిబొమ్మను తయారు చేసి, ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు పి.వి.శేషాచార్యులు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ గాలిగోపురం ఎదురుగా దగ్ధం చేశారు. వేణుగోపాలస్వామి క్షేత్రపాలకుడుగా ఉన్న ఈ ఆలయంలో ప్రతి ఏటా నరకాసుర వధ జరుపుతారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 19వ తేదీన విశాఖపట్నంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్వ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత : ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం:

అవగాహన సదస్సు తేదీ:
నవంబర్ 19, 2023(ఆదివారం)

వేదిక:
డా. బి.ఆర్.అంబేద్కర్ భవన్, రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా, రామా టాకీస్ దగ్గర, శ్రీనగర్, విశాఖపట్నం.

సమయం:
ఉదయం 09.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

ఆసియా పారా క్రీడల్లో విజేతకు ఘన స్వాగతం

- షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన రవికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఘన సన్మానం
- కె.కోటపాడు నుంచి స్వగ్రామం చిరికివానిపాలెం వరకూ ఊరేగింపుగా తీసుకువెళ్లిన గ్రామస్తులు


కె.కోటపాడు నుండి ర్యాలీగా రవిని తీసుకువెళ్తున్న గ్రామస్తులు


పారా క్రీడల్లో సిల్వర్‌మెడల్‌ను సాధించిన రవిని దుశ్శాలువాతో సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : చైనాలో జరిగిన ఆసియా పారా క్రీడల్లో షార్ట్‌పుట్‌లో రవి వెండిపతకం సాధించడం హర్షణీయమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గత నెల 24న జరిగిన ఆసియా పారా క్రీడల్లో షాట్‌పుట్‌లో వెండి పతకాన్ని సాధించిన రొంగలి రవి స్వగ్రామం చిరికివానిపాలెంకు శనివారం చేరుకున్నాడు. ఈ సందర్భంగా చిరికివానిపాలెం, వారాడ గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన రవికి కె.కోటపాడులో ఘనస్వాగతం పలికారు. కోలాట ప్రదర్శనతో పాటు గ్రామానికి చెందిన యువకులు కె.కోటపాడు నుంచి బైక్‌ర్యాలీతో సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, వారాడ మీదుగా స్వగ్రామం చిరికివానిపాలేనికి రవిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు... రవికి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ సీఎం బూడి, రొంగలి రవి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆసియా పారా క్రీడా పోటీల్లో వెండి పతకాన్ని సాధించిన రవి ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకు వచ్చాడన్నారు. రాబోయే రోజుల్లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభ ఉంటే అంగవైకల్యం విజయాలకు అడ్డురాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వారాడ సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఉర సర్పంచ్ చిరికి గోవింద, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, పాల సంఘం అధ్యక్షుడు దొగ్గ శివప్రసాద్, బొడ్డు దొరస్వామినాయుడు(లాయర్) పాల్గొన్నారు. కుమారుడు రవికి ఘనస్వాగతం లభించడంతో తల్లిదండ్రులు దేముడుబాబు, మంగ హర్షం వ్యక్తం చేశారు.

ప్రభంజనంతో ప్రతిపక్షాల్లో భయం


నాగదుర్గమ్మ జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరైన జనాన్ని చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ఈనెల 17న జరగనున్న నాగదుర్గమ్మ జాతర పోస్టర్‌ను మిందిలోని తన స్వగృహంలో శనివారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. తొలిదశ బస్సుయాత్రలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సభలో జగన్ మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలంటూ ప్రజలు చేసిన హర్షధ్వానాలు ప్రతిపక్ష నేతల్లో గుబులు రేపాయని చెప్పారు. రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీ నర్సింహరావు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వేగి త్రినాథ్, సూర్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు, ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, మారిశెట్టి శ్రీనివాసరావు, విజ్జపు ముకుంద, తాడి నాగలక్ష్మి, చంద్రకళ, తగరంపూడి నరసింహారావు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి విదేశాల్లోనూ ఆదరణ


ధర్మ సమ్మేళన సభలో మాట్లాడుతున్న కమలానంద భారతి స్వామి


సమ్మేళనానికి హాజరైన భక్తులు

- భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి

మాడుగుల: భారత సనాతన ధర్మానికి విదేశాల్లోనూ విశేష ఆదరణ లభిస్తుందని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మాడుగులలో హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి భువనేశ్వరీ పీఠం పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి హాజరై మాట్లాడారు. గృహాశ్రమం కలిగిన ధర్మశాస్త్రం ఆచరిస్తున్న జాతి హిందూ జాతి అన్నారు. రామాయణం, మహాభారతం ప్రవచనాలు చేసి సనాతన సంప్రదాయాల విశిష్టతను వివరించారు. భారత సంస్కృతీ సంప్రదాయాలు గొప్పదనాన్ని మరువొద్దన్నారు. భారత సనాతన సంప్రదాయాన్ని పాశ్చాత్య దేశాల్లో చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు కమలానంద భారతి స్వామిని సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు ఊరేగింపుగా సభ వద్దకు తీసుకు వచ్చారు. కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, ఉత్తరాంధ్ర ధర్మప్రచారక్ ఆడారి గంగాధర్, జిల్లా సంస్కృతి ప్రముఖ్ చుచ్చకర్ల నాగేశ్వరరావు, మండల ధర్మ ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, భక్తులు పాల్గొన్నారు.



బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన తిర్యాదుల దావీదు

పాయకరావుపేట : అతివేగంగా మోటారు బైక్ నడుపుతూ బైక్‌పై నుంచి పడిపోయి యువకుడు మృతి చెందినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. తుని అంబాజీ పేటకు చెందిన తిర్యాదుల దావీదు (22) తన స్నేహితునితో కలిసి శుక్రవారం సాయంత్రం రాజవరం గ్రామ సమీపాన గల సముద్రం ఒడ్డుకు వెళ్లి అక్కడ కొంతసేపు గడిపి తిరిగి తుని వెళ్లిపోతున్నారు. మార్గమధ్యలో శ్రీరాంపురం వద్ద వారు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో తిర్యాదుల దావీదుకు బలమైన గాయాలు తగలడంతో మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు.

ఘనంగా ముగిసిన రిమ్ జిమ్ వేడుకలు


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రిమ్ జిమ్ -2023 కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా తుని, పాయకరావుపేట, అన్నవరం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన 4,500 మంది విద్యార్థులకు సాహిత్యం, ఆటలు, కళలు, తదితర 29 రకాల అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు అతిథులుగా విచ్చేసిన అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి ఎస్.సూర్య చంద్రశేఖర్ ఆజాద్, పాయకరావుపేట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.అప్పలరాజు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్.సూర్యచంద్ర శేఖర్ ఆజాద్ మాట్లాడుతూ స్కూల్ స్థాయి స్నేహ బంధాన్ని చివరి వరకు కొనసాగించాలని, అదే మన జీవితంలో నిజమైన సంపదగా నిలుస్తుందన్నారు. మరొక అతిథి పి.అప్పలరాజు మాట్లాడుతూ పరిపూర్ణమైన ఆరోగ్యం ఆటల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యన్న అనుచరుల గ్రావెల్ దందా

- ఎమ్మెల్యే గణేష్‌పై దుష్ప్రచారం సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ నాయకులు


పోలీసులు పట్టుకున్న పొక్లెయిన్ వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాతవరం: మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అనుచరుడు జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ బంధువు శ్రీను పొక్లెయిన్‌ను పోలీసులు పట్టుకుంటే, తమ ఎమ్మెల్యే గణేష్‌పై దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పోలీసు స్టేషన్ వద్ద వారు మాట్లాడారు. నాతవరం మండలం చెర్లోపాలెం పంచాయతీ శివారు లక్ష్మిపురంలో ఏలేరు కాలువ గట్టుపై పొక్లెయిన్‌తో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారని ఆరోపించారు. ఈ తవ్వకాలు మాజీ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడు అనుచరులే చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, మంకు సాంబమూర్తి, ఇట్టంశెట్టి శ్రీను, పార్టీ సీనియర్ నాయకుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, లింగంపేట సర్పంచ్ లోకవరపు రాము, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, చినగొలుగొండపేట సర్పంచ్ పాలురాజు, జిల్లేడుపూడి మాజీ సర్పంచ్ లాలం లోవ, తదితరులు పాల్గొన్నారు.

హత్యా యత్నంలో కేసులో ముగ్గురి అరెస్టు

మాడుగుల రూరల్: చీడికాడ మండలం వరహాపురంలో హత్యా యత్నంలో కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి. రామారావు శనివారం తెలిపారు. ఈ నెల 7న గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు యలమంచిలి చిన్నను కొంతమంది సైకిల్ చైను, కర్రతోను, ఇనుపరాడ్లతోను కొట్టి గాయపర్చారని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, నిందితులు యలమంచిలి అప్పన్న, యలమంచిలి అర్జున, యలమంచిలి గంగరాజులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

కొత్తూరులో 50 కోతుల పట్టివేత


బోనులో బంధించిన కోతులతో భీశెట్టి జగన్, గ్రామస్తులు

అనకాపల్లి టౌన్: మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీ ప్రజలకు కోతుల బెడద నుంచి విముక్తి కలిగింది. ఇక్కడ రెండేళ్లుగా కోతులతో ఇబ్బందులు పడుతున్నారు. వీరి బాధలను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు భీశెట్టి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన శనివారం రాజమహేంద్రవరానికి చెందిన పది మందితో భారీ బోన్లు తీసుకొచ్చి 50 కోతులను బంధించారు. మిగతా వాటి కోసం మరిన్ని బోన్లు ఏర్పాటు చేసి పంచాయతీలో కోతులు లేకుండా చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పట్టుబడిన కోతులను సురక్షితంగా అటవీ ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపునకు ఆర్డీవో ఆదేశం

- సెలవు రోజున పరుగులు పెట్టిన రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..


గెడ్డలో జీడిచెట్లు తొలగిస్తున్న వీఆర్ఏలు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి మండలం ఎర్రవరం రెవెన్యూ లైనుకొత్తూరులోని సర్వే నంబరు 94లో గెడ్డ భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. 'దర్జాగా గెడ్డ కబ్జా శీర్షికన' సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ స్పందించి తక్షణమే ఆక్రమణలు తొలగించి నివేదిక పంపాల్సిందిగా యలమంచిలి తహసీల్దార్ ఎస్ రాణీ అమ్మాజీకి ఫోన్లో ఆదేశించారు. మూణ్నెల్ల క్రితమే ఎర్రవరంలో గెడ్డ ఆక్రమణకు సంబంధించి మండల సమావేశంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, లైను కొత్తూరు సర్పంచ్ కొల్లి రజిని తదితరులు ప్రస్తావించారు. దీనిపై సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని మండల సర్వేయర్ సభ్యులకు సభాముఖంగా తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు గెడ్డలో ఆక్రమణల తొలగించలేదు. దీనిపై సాక్షిలో కథనం రావడంతో గెడ్డలోని ఆక్రమణలు తక్షణమే తొలగించాలని ఎర్రవరం వీఆర్వో గాంధీని తహసీల్దారు ఆదేశించారు. రెండో శనివారం సెలవు రోజు అయినప్పటికీ వీఆర్వో కొంతమంది వీఆర్ఏలను వెంటబెట్టుకుని అక్కడ జీడి మొక్కలను నరికివేయించి గెడ్డలో ఓ భూస్వామి ఏర్పాటు చేసుకున్న దారిలో గేటును తొలగించారు. సాక్షి కథనంతో అధికారుల్లో కదలిక రావడం చర్చనీయాంశమైంది.

దిబ్బిడిలో అదుపులోకి వచ్చిన డయేరియా


దిబ్బిడిలో బాధితుల ఇళ్లకు వెళ్లి మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడిలో అతిసార (డయేరియా) అదుపులోకి వచ్చింది. మూడో రోజు శనివారం బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కృష్ణ, తమ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేయడమేగాక బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంకు నీళ్లు బాగానే ఉన్నట్లు రిపోర్టు వచ్చిందని గ్రామస్తులంతా నిర్భయంగా తాగొచ్చని వైద్యుడు సూచించారు. బుధవారం సంతలో కొనుగోలు చేసిన మాంసాహారాలు వల్ల గాని గ్రామంలో ఇటీవల పలు ఫంక్షన్‌లో తిన్న కలుషిత ఆహారం వల్ల గాని అతిసార వ్యాపించి ఉండొచ్చని భావిస్తున్నారు. గ్రామంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు పర్యటించి బాధితులను పరామర్శించారు. ఎంపీడీవో సువర్ణరాజు శానిటేషన్ చేయించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎస్.రాయవరం విద్యార్థిని


కావ్యకు జ్ఞాపిక అందజేస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

ఎస్.రాయవరం: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కర్రి కావ్య జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. అండర్ - 17 విభాగంలో ఎంపికై నట్టు చెప్పారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో కావ్య ప్రతిభ కనబరచిందన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థినితోపాటు పీడీ శ్రీనివాసును అభినందించారు.

మంటల్లో గాయపడిన వ్యక్తి మృతి


కొండయ్య మృతదేహం

పాయకరావుపేట: మండలంలో పాల్తేరు గ్రామానికి చెందిన మడత కొండయ్య (53) శరీరం కాలిపోవడంతో మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... కొండయ్య తన ఇంట్లో దీపారాధన సమయంలో పక్కనే పెట్రోల్ బాటిల్‌పై పొరపాటున కాలు వేయడంతో మంటలంటుకుని అతడి దేహం కాలిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తుని ఆస్పత్రికి తరలించగా, అక్కడ 15 రోజుల నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవం

కశింకోట: స్థానిక డీపీఎన్ హైస్కూలు వద్ద గౌరీపరమేశ్వరుల విగ్రహం నిలుపు ఉత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జాతీయ రహదారి నుంచి గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని నేల వేషాలు,కోలాటాలు, మేళతాళాలతో బాణసంచా పెద్ద ఎత్తున కాలుస్తూ ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మ వారిని నెలకొల్పి పూజలు చేశారు. సుమారు ఐదు దశాబ్దాలుగా కార్తీక మాసం నెల రోజులు నిత్య పూజలు జరిపి ఫిబ్రవరి నెలలో భారీ ఎత్తున ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

చంద్రమోహన్ మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు

అనకాపల్లిటౌన్: చలనచిత్ర నటుడు చంద్రమోహన్ మరణం సినీపరిశ్రమకు తీరని లోటు అని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచి నటుడిని కోల్పోయామని పేర్కొని, సంతాపం వ్యక్తం చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, కశింకోట శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆయా గ్రంథాలయాల అధికారులు కె. వరలక్ష్మి, కె.జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర లేఖనం, పద్యాల పోటీలు, వివిధ ఆటల పోటీలు, మహిళా దినోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు చివరి రోజు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామని చెప్పారు.

అనకాపల్లిటౌన్: స్థానిక శాఖాగ్రంథాలయంలో 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 15న దివ్యాంగుల కార్యక్రమం, పాటల పోటీలు, సభ్యత్వ సేకరణ, 16న గ్రంథాలయాల ఉద్యమానికి కృషి చేసిన నాయకుల సంస్మరణ కార్యక్రమం, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కవి సమ్మేళనం, 17న ఝాన్సీలక్ష్మీభాయ్ జీవితచరిత్రపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న 3 నుంచి 6వ తరగతుల విద్యార్థులకు వివిధ ఆటలపోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపుసభ, బహుమతి ప్రదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 2,551 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,700	4,300
రెండో రకం	3,460	4,190
మూడోరకం	3,280	3,610

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
జపాన్	: సత్యనారాయణస్క్రీన్-1
ద మార్వెల్స్(తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-2 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 471 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 446 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

ఆనందాలకు దూరంగా .. నిత్యం అప్రమత్తంగా..



సిద్ధంగా ఉన్న అగ్నిమాపక శకటాలు

- దీపావళి పండగ నాడు విధుల్లో అగ్నిమాపక శాఖ అధికారులు
- జాగ్రత్తగా పాటించాలని సూచన

అనకాపల్లిటౌన్: దీపావళి పండగ పేరు వింటేనే ఆనందోత్సవాలు వెలుగులీనుతున్నాయి. కొత్త బట్టల మెరుపులతో.. పిండివంటల ఘుమఘుమలతో సాయంత్రం వేళ అందమైన దీపాల వెలుగుతో ప్రతి ఇల్లు కళకళలాడుతుంది. టపాసుల వెలుగుల్లో ప్రతి మోము వెలిగిపోతుంది. పిల్లాపాపలతో అందరూ ఆనందంగా పండగ జరుపుకొంటుంటే. కుటుంబాన్ని వదిలి ప్రజల యోగక్షేమాలే కర్తవ్యమంటూ అగ్నిమాపక అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ అగ్ని ప్రమాదాల నిరోధానికి కృషి చేస్తారు. దీపావళి ఆనందాలకు దూరంగా అగ్నిమాపక సిబ్బంది ఉంటారు. అగ్నిప్రమాదం జరగకూడదంటూ దేవుణ్ణి వేడుకుంటారు. కుటుంబానికి దూరంగా విధుల్లో తలమునకలవుతారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిందని తెలిస్తే హుటాహుటిన అక్కడికి చేరుకొని నష్టనివారణ చర్యలు ప్రారంభిస్తారు. అగ్నిమాపక దళం వాహనం నిండా నీరుందా, టైర్లలో గాలి ఉందా, పైపులు సిద్ధం చేశామా అనే ఆలోచన తప్ప ఇంకేం ఉండదు. ఏ క్షణం ఎక్కడి నుంచి ఫోన్‌కాల్ వస్తుందోనని రెప్పవాల్చకుండా ఆ రోజంతా అగ్నిమాపక కార్యాలయానికి అంకితమవుతారు. ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా స్పందిస్తారు అగ్నిమాపక అధికారులు.

ప్రజలను కాపాడినప్పుడే పండగ...



దీపావళి పండగను కుటుంబసభ్యులతో చేసుకోవాలని మాకూ ఉంటుంది. కానీ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఈ పండగను సవాల్‌గా తీసుకుని విధులు నిర్వహిస్తాం. టపాలు కాల్చడం అందరికీ సరదానే. అయితే అవగాహన లేకుండా ఇష్టానుసారం కాలిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలి. భారీ అగ్నిప్రమాదాల నుంచి ప్రాణ, ఆస్తినష్టం నుంచి కాపాడినప్పుడే మాకు నిజమైన దీపావళి పండగ.

–కె.నరసింగరావు, అనకాపల్లి, అగ్నిమాపక అధికారి.

అందాల ప్రమిదలు... ఆనంద కాంతులు

- మార్కెట్లో పండగ కళ
- వివిధ ఆకృతుల్లో ప్రమిదలు
- దీపావళి సామగ్రి విక్రయాలతో సందడి



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళ

అనకాపల్లి రూరల్: దీపావళి అంటే వెలుగుల పండగ. ఈ పండుగలో దీపమే ప్రధానం. ఇందుకోసం సాధారణ ప్రమిదలతో పాటు కొత్తరకం ప్రమిదల్లో దీపాలను వెలిగించేందుకు మహిళలు ఆసక్తి చూపుతారు. అలాంటి వారి కోసం అనకాపల్లి పట్టణం, మండలంలో తుమ్మపాల, కొత్తూరు మార్కెట్లో సాధారణ రకంతో పాటు పలు డిజైన్లలతో ప్రమిదలను విక్రయిస్తున్నారు. ఇటీవల స్థానికంగా తయారైన ప్రమిదలతో పాటు చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో భిన్నంగా ఉండే ప్రమిదలను కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్రమిదల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. ఏటా ఈ పండగ కోసం ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రహదారి కూడళ్లల్లో ప్రమిదల అమ్మకాలు జోరుగాసాగుతాయి. చెన్నై నుంచి తీసుకొచ్చినవాటిలో కళ్లు చెదిరే డిజైన్లు ఉండడంతో స్థానికులు వాటి పట్ల ఆకర్షితులవుతున్నారు. మట్టి దీపాలకు ఆదరణ తగ్గడంతో స్థానిక కుమ్మర్లలో కొందరు ఇతర రాష్ట్రాల నుంచి కళాత్మకమైన ప్రమిదలను తెచ్చి విక్రయిస్తున్నారు. డజను రూ.40 నుంచి రూ.80 ధరల్లో అందుబాటులో ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి మున్సిపల్ స్టేడియం పరిసరాలు, తుమ్మపాలకొత్తూరు జంక్షన్, పెరుగుబజారు, గుండాల కూడలి ఇలా పలు ప్రదేశాల్లో రహదారుల పక్కన గుట్టలుగా పోసిన ప్రమిదలను విక్రయిస్తున్నారు. కొందరు వీధుల్లో తిరుగుతూ తోపుడు బండ్లపై వీటిని విక్రయిస్తున్నారు. ప్రమిదల్లో నూనె ఎక్కువగా పీల్చని టెరక్రోటా రకాలనే కొనేందుకు ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్తీకమాసంలో నాలుగు వారాలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తారు. కనుక మహిళలు ముందు జాగ్రత్తతో కళాత్మకమైన ప్రమిదలను కొంటున్నారు. ప్రమిదలు,బొమ్మల కొనుగోళ్లతో పాటు పిల్లలు, పెద్దలకు ఇష్టపడే బాణసంచా కొనుగోళ్లతో మార్కెట్లో సందడి కనిపించింది.

మట్టి ప్రమిదలు సంప్రదాయం



దీపావళికి మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో చిన్న చిన్న ప్రమిదల్లో వెలిగించేవారం.మారుతున్న కాలంతో పాటు దీపావళికి ప్రత్యేకంగా వివిధ రకాల డిజైన్లతో ప్రమిదలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని చూడగానే ఆకర్షిస్తున్నాయి. ధర ఎంతైనా కొనాలనిపిస్తోంది. ఇప్పుడే మార్కెట్‌కు వెళ్లి ప్రమిదలు కొనుక్కొచ్చాను.

– కూచిమంచి కనకమహాలక్ష్మి, గృహిణి, అనకాపల్లి

ఘన జీవామృతంతో ఆరోగ్యకర పంటలు



ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న అరుణ

కశింకోట: సహజ సిద్ధంగా తయారయ్యే ఘన జీవామృతాన్ని ఎరువుగా వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రజలకు అందించాలని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి కూండ్రపు అరుణ కోరారు. మండలంలోని సుందరయ్యపేటలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళా రైతులకు ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన జీవామృతం ఎరువుగా వాడి పండించిన ఉత్పత్తులు ప్రజలు వినియోగించడం వల్ల బీపీ,మధుమేహం, గుండెపోటు తదితర వ్యాధులకు దూరం చేయవచ్చన్నారు. యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువులతో పండించిన ఉత్పత్తులు వినియోగించడం వల్ల వ్యాధులకు గురికావలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. జీవామృతాన్ని ఇళ్ల వద్ద కూడా తయారు చేసుకోవచ్చునన్నారు. ఆవు పేడ, ఆవు మూత్రం ,శెనగ పిండి, బెల్లం, పుట్టమన్ను కలిపి పిడకలుగా చేసి వారం రోజులపాటు నీడన ఎండబెడితే ఘన జీవామృతం తయారవుతుందన్నారు.

దీన్ని పొడిగా చేసి తగిన మోతాదులో భూమిలో దుక్కిలో వేసి దున్ని పంటలు సాగు చేయవచ్చని చెప్పారు. ఖర్చు తక్కువ కావడం తోపాటు ప్రయోజనం ఎక్కువ కలుగుతుందని, భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వెంకట అప్పారావు, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించేందుకు కృషి చేయాలి



రత్నాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్: ఉన్నతస్థానాలను అధిరోహించేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఎస్సీ వసతిగృహంలో జరుగుతున్న మరమ్మతు పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఈ పనులకు తన సొంత సొమ్ము ఖర్చు చేసినట్టు చెప్పారు. గతంలో ఈ వసతిగృహాన్ని సందర్శించిన సమయంలో బాగా శిథిలావస్థకు చేరుకోవడం గమనించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులతో మరో 20 ఏళ్ల వరకు వసతిగృహంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదన్నారు. వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు పలువురు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానటరింగ్ సభ్యులు రేబాక మధుబాబు, అప్పలరాజు, సబ్ రిజిస్ట్రార్ బండారి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల ప్రవీణ్, బొడ్డపాటి చినరాజారావు, కటారి దేముడు, మొల్లి రమణబాబు, ఇంటి త్రినాథ్, నంబారు రమణ, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: వెలుగులో పనిచేస్తున్న గ్రామ సంఘం సహాయకు(వీవోఏ)ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కశింకోటలో శనివారం నిర్వహించిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక,కర్షక,ఉద్యోగ,మహిళ, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని విమర్శించారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, యూనియన్ ప్రతినిధులు మంగ, భారతి, ఆదిలక్ష్మి,భాగ్య, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలి



కోటికుంకుమార్చన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలో గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద గౌరీపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 29 నుంచి డిసెంబర్ 8వతేదీ వరకు నిర్వహించే కోటి కుంకుమార్చన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. దైవభక్తివైపు చిన్నారులను మళ్లించాలని తెలిపారు.

ప్రతి గ్రామంలో రామాలయాల అభివృద్ధికి కమిటీలు వేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు యల్లపు చంద్రమోహన్, దాడి ఈశ్వరరావు, దాడి రామారావు నాయుడు, కాండ్రేగుల రామలింగస్వామి, కొణతాల పరదేశినాయుడు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కాండ్రేగుల సాంబ, జగదీష్, నాగేశ్వరరావు, వామాల కాశీ, మొల్లి రమణబాబు, పిరాట్ల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న మందపాటి సునీత, జానకీరామరాజులు

అనకాపల్లిటౌన్: ఇంటింటికీ రేషన్ పంపిణీని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత శనివారం పరిశీలించారు. వార్డులో ప్రజలకు ప్రత్యేక వాహనం ద్వారా ఇంటి వద్దకు వచ్చి అందజేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీనికి సంబంధించిన వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, వైర్ల లోపాలను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పంచరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబైన తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారి ఆలయం



భూలోకమాంబ అమ్మవారు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 80 ఏళ్లుగా యలమంచిలి తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పేర్లతో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు పట్టణంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా తులసీనగర్, దిమిలి రోడ్డు కూడలి, పాతవీధి, ప్రధాన, అంతర్గత రహదారులకు ఇరువైపులా ఆకర్షణీయంగా భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. భూలోకమాంబ అమ్మ వారిని సాక్షాత్తూ లక్ష్మీదేవి రూపంగా ఇక్కడ భక్తులు భావిస్తారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు, రాత్రులు నూనె దీపాలు వెలిగించి అమ్మవారిని కొలుస్తారు. పంచరాత్రి ఉత్సవాలు ఆదివారం లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. భూలోకమాంబ ఆలయం వద్ద జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆడారి తులసీరావు కుటుంబీకులు పెద్దలుగా వ్యవహరిస్తారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు.

సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని ఏపీడబ్ల్యూఎల్ఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాసశివరాత్రి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అంతకుముందు ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టి.కామేశ్వరరావు, ధర్మకర్తలు గర్రెడ్డి నూకరాజు, కేవీఎస్ఆర్ఎస్.సుబ్రహ్మణ్యం, ఒడిశెట్టి కనక, ఎన్.నాగమణి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దాడి రత్నాకర్



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

అనకాపల్లిటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన దేశ తొలివిద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం బలోపేతాని ఆజాద్ కృషి చేశారని చెప్పారు. అంతకుముందు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఎస్ఐ బి.అంజిబాబు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్: స్థానిక 'డైట్' కళాశాలలో శనివారం జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్: మన దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ విశేషసేలందించారని అగ్నిమాపక అధికారి నరసింగరావు అన్నారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో శనివారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. అంతకుముందు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ఔషధ మొక్కలు నాటుతున్న డాక్టర్ లావణ్య

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో ధన్వంతరి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య ప్రధాత ధన్వంతరికి పూజలు చేశారు. ఆస్పత్రి ఆవరణలో వైద్యాధికారి కె.లావణ్య ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ దీపావళికి సహకరించండి

- మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు
- యలమంచిలిలో స్వచ్ఛ దీపావళి ర్యాలీ

యలమంచిలి : పట్టణంలో ప్రజలందరూ స్వచ్ఛ దీపావళికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. శనివారం యలమంచిలి పట్టణంలో స్వచ్ఛ్ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛ దీపావళి జరుపుకోవడంపై మున్సిపల్ ఉద్యోగులు , కార్మికులతో కలసి కమిషనర్ కొండలరావు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కొండలరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరూ పర్యావరణానికి అనుకూలమైన స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని , క్లీన్ అండ్‌గ్రీన్ శుభ దీపావళి జరుపుకోవాలని ప్రతి ఒక్కరు శబ్ద కాలుష్య నియంత్రణ ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించడం నిషేధించాలని ప్రజలందరూ స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ నిర్వహించి పురప్రజలకు అవగాహన ర్యాలీని పట్టణంలో పురపాలక సంఘం నుండి పాత జాతీయ రహదారి వైఎస్సార్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, శానిటరి అసిస్టెంట్‌లు మున్సిపల్ పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మి పూజలు



ధనలక్ష్మి పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో శనివారం ధనలక్ష్మిపూజలు నేత్రపర్వంగా జరిగాయి. అర్చకులు రేజేటి చక్రవర్తి, యనమండ్ర శ్రీనివాస్, సందీప్, బోసుస్వామిలు మహిళలచే పూజలు చేయించారు. అంతకుముందు ఈ పూజలను ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఆలయ ఈవో బండారు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి జయవీర్, 80వవార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ద నర్సింగరాజు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి, వెంకటరావు, మల్లవరపు ఈశ్వరరావు, అధికసంఖ్యలో మహిళాభక్తులు పాల్గొన్నారు.